https://epaper.manasamajam.com Contact No. 9989788438, 9505285656

# మన సమాజం

తెలుగు డిజిటల్ దిన పత్రిక

Truth towards the Society

చైర్మెన్ : పార్వతి సురేష్ కుమార్ ఎడిటర్ : పార్వతి రాజేష్ కుమార్

సంపుటి : 02 సంచిక : 78 శుక్రవారం 24-07-2026 పేజీలు : 4

రిపోర్టర్స్ కావలెను

మన సమాజం
Truth towards the Society

మన సమాజం తెలుగు డిజిటల్ దినపత్రికలో
నిఖార్సైన జర్నలిస్టుగా నిలబడాలనుకుంటున్నారా?
అన్ని తరహా వార్తలు, కథనాలు ఎలాంటి ఆంక్షలు లేకుండా రాయాలని కోరుకుంటున్నారా?
తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాలల్లో పనిచేసేందుకు విలేఖరులు కావలెను...
మీ కలాలకు పదును పెట్టండి.

సంప్రదించవలసిన నెంబర్లు
9989788438, 9505485656.

## నేడు విద్యాసంస్థల బంద్..

హైదరాబాద్, జూలై 23:
నీట్ పేపర్ లీకేజీలు, పరీక్షల నిర్వహణలో వరుస వైఫల్యాలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న డిమాండ్‌తో విద్యార్థి సంఘాలు రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చాయి. దీంతో హైదరాబాద్‌తో పాటు వివిధ జిల్లాల్లోని పాఠశాలలు శుక్రవారం సెలవు ప్రకటించాయి. జీహెచ్ఎంసీ పరిధిలో దాదాపు 3,500 ప్రైవేటు పాఠశాలలు ఉండగా సగానికి పైగా సెలవు ప్రకటించాయని తెలంగాణ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎన్ రెడ్డి తెలిపారు. ప్రైవేటు జూనియర్, డిగ్రీ కాలేజీలు సైతం సెలవు ప్రకటించాయి. బంద్ పిలుపు నేపథ్యంలో జేఎన్‌టీయూ, ఉస్మానియా, కాళోజీ వర్సిటీలఆధ్వర్యంలో శుక్రవారం జరగాల్సిన పరీక్షలు వాయిదాపడ్డాయి.

## డీజీపీ కార్యాలయంలో కానిస్టేబుల్ ఆత్మహత్య

హైదరాబాద్, జూలై 23:
రాష్ట్ర డీజీపీ కార్యాలయంలో సెంట్రీ విధుల్లో ఉన్న కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకున్నారు. బాత్‌రూంలోకి వెళ్లి.. తన సర్వీసు రివాల్వర్‌తో కాల్చుకో వడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు గుర్తించారు. ఆర్థిక సమస్యలతోనే కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకున్నారని ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడుకు చెందిన స్వామి 2007లో పోలీసు కానిస్టేబుల్‌గా చేరారు. కొండాపూర్ 8వ బెటాలియన్‌లో పని చేస్తున్న స్వామిని 20 రోజుల క్రితమే డీజీపీ ఆఫీసుకు బదిలీ చేశారు.

## యువత భవితే ముఖ్యం

అదే మా ప్రాధాన్యం
ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేస్తాం
ప్రశ్నపత్రాల లీకేజీ బాధ్యులకు త్వరితంగా, కఠినమైన శిక్షలు పడేలా చూస్తాం
ఎక్స్‌లో ప్రధాని నరేంద్రమోదీ ప్రకటన
నెలన్నర తర్వాత ప్రధాని స్పందించారు
ఫాస్ట్‌ట్రాక్ కోర్టులున్నా లీకేజీలు జరుగుతున్నాయి
కారణం.. ధర్మేంద్ర ప్రధాన్ అసమర్థత
ఆయన రాజీనామా చేసే వరకూ కదిలేది లేదు
ప్రజాగ్రహం మోదీ మీదకూ మళ్లుతోంది: సీజేపీ



న్యూఢిల్లీ, జూలై 23:
గత కొన్ని వారాలుగా దేశాన్ని కుదిపేస్తున్న నీట్ పేపర్ లీకేజీ, కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఉద్యమంపై ప్రధాని మోదీ కీలక ప్రకటన చేశారు. ప్రశ్నపత్రాల లీకేజీలకు బాధ్యులైన వారికి వీలైనంత త్వరగా కఠిన శిక్షలు పడేలా ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు.ఈమేరకు గురువారం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'మన యువత సంక్షేమం, భవిష్యత్తుకన్నా ముఖ్యమైనది ఏదీ లేదు. ఇదే మాకు అత్యంత ప్రాధాన్యం కలిగిన అంశం. యువత భవిష్యత్తుకు నష్టం చేసే ప్రయత్నాలు చేసే వారిని ఉపేక్షించేది లేదు' అని మోదీ పేర్కొన్నారు. పేపర్ లీకేజీలకు సంబంధించి అవసరమైన చర్యలన్నింటినీ తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు ప్రధాని వెల్లడించారు. విద్యార్థుల ప్రయోజనాలను పరిరక్షించటానికి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాల్లో ఇదొక ముఖ్యమైన అంశమని పేర్కొన్నారు. ప్రధాని ప్రకటనపై సీజేపీ అధికార ప్రతినిధి అశుతోష్ రంకా స్పందిస్తూ.. 'నెలన్నరగా జరుగుతున్న నిరసనల తర్వాత మొత్తానికి ప్రధాని ఈ విషయాన్ని పట్టించుకున్నారు. బహుశా ఆయన విదేశీ పర్యటనలు పూర్తయి భారత్‌కు వచ్చినట్లున్నారు. ఏదేమైనా ఇదొక మంచి పరిణామమే. కానీ, ఇప్పటికే జరిగిన పేపర్ లీకేజీలకు సంబంధించిన బాధ్యులకు మీరు ఏ శిక్షలు విధించారు? గాయం అయిన తర్వాత మందు రాయటం ఒకటైతే.. అసలు గాయం కాకుండా చూడటం మరొకటి. వ్యవస్థను నడుపుతున్న వాళ్లు అసమర్థులు, నిజాయితీ లేని వారు కాబట్టి గాయాలు పునరావృతమవుతున్నాయి.

మిగతా 2లో...

# గ్లోబరీనా.. కేటీఆర్ బినామీ!

దాని అడుగుజాడల్లోనే నీట్ స్కాం.. సీబీఎస్ఈ ఫలితాల్లోనూ ఘోర వైఫల్యం

- తెలంగాణలో 27 మంది ఇంటర్ పిల్లల్ని పొట్టనబెట్టుకుంది
- ఆ సంస్థతో కేటీఆర్‌కు సంబంధమే లేకుంటే దాని అవకతవకలపై విచారణ కోరాలి
- నాకు 2 ఓట్లు ఉంటే పోలీసు కేసు పెట్టండి.. తప్పుడు ఫిర్యాదైతే పెట్టినోళ్లే జైలుకు
- మీడియాతో ఇష్టాగోష్ఠిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, జూలై 23 :
వివాదాస్పద గ్లోబరీనా కంపెనీ కేటీఆర్ బినామీ సంస్థ అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఆ కంపెనీతో కేటీఆర్‌కు నిజంగా సంబంధమే లేకుంటే దానిపైవిచారణ కోరుతూ సీసీఎస్‌లో ఫిర్యాదు చేయాలని డిమాండ్ చేశారు. ఆయన ఫిర్యాదు చేస్తే విచారణ జరిపించి సదరు కంపెనీ అక్రమ లావాదేవీలన్నీ బయటికి తీస్తామన్నారు. అసెంబ్లీ ఆవరణలోని మీడియా అడ్వయిజరీ కమిటీ హాల్లో గురువారం ఆయన మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు గ్లోబరీనా సంస్థకు ఇంటర్..

మిగతా 2లో...

# ఎల్‌నినో ప్రభావం తీవ్రమే

## తాగునీటికి కటకట రావొచ్చు.. ఎద్దడి నివారణకు ప్రాధాన్యం

- పశుగ్రాసానికి కొరత రావొద్దు.. ఉన్న నీటిని పొదుపుగా వాడాలి
- ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలి
- కృష్ణా డెల్టాలో వరి ఎక్కువ సాగు చేయకుండా చూడాలి
- వర్షాభావంతో రైతు నష్టపోకూడదు.. సబ్సిడీపై సీడ్‌బాల్స్
- బనకచర్ల మీదుగా గోదావరి-కావేరి సంధానానికి కేంద్రం ఓకే
- దీపం-2 కింద 4 నెలలకోసారి ఒకే రోజు లబ్ధిదారులకు డబ్బులు
- భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభానికి 1న ప్రధాని వస్తున్నారు
- ఆగస్టు చివర్లో మదనపల్లెలో ఉద్యాన హబ్ ప్రారంభం: సీఎం



అమరావతి, జూలై 23:
దేశవ్యాప్తంగా ఉన్న ఎల్‌నినో ప్రభావంతో ఈసారి క్లిష్ట పరిస్థితులు ఎదురయ్యే ప్రమాదం ఉందని సీఎం చంద్రబాబు అన్నారు. తాగునీటికీ తీవ్ర సమస్యలు ఎదురుకావచ్చని హెచ్చరించారు. సంక్షోభాన్ని అధిగమించేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని, తాగునీటికి తొలి ప్రాధాన్యమివ్వాలని, పశుగ్రాసానికి కొరత రాకుండా చూడాలని, ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని మంత్రులకు సూచించారు. అన్ని శాఖలు సమన్వయంతో కలిసి పనిచేసి ఎల్‌నినో సంక్షోభాన్ని అధిగమించేందుకు కృషి చేయాలన్నారు. గురువారం సచివాలయంలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఎజెండా అంశాలపై చర్చ అనంతరం ఎల్‌నినోపై సీఎం మంత్రులతో సుదీర్ఘంగా చర్చించారు. ఈ విషయంలో ప్రజలకు వాస్తవ పరిస్థితులను వివరించాలన్నారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ జోక్యం చేసుకుని.. పశ్చిమ గోదావరి జిల్లాలో 59 శాతం లోటు వర్షపాతం ఉంటే 460 శాతం అధికంగా వరి విస్తీర్ణం జరిగినట్లు అధికారులు చూపుతున్నారని, ఇలాంటి పరిస్థితులను ఎలా అధిగమిస్తామని ప్రశ్నించారు. సీఎం స్పందిస్తూ.. ఇప్పటికే వేసిన వరిని బతికించేందుకు చర్యలు తీసుకుంటూనే అదనంగా ఎవ్వరూ వరి సాగు చేయకుండా చూడాలన్నారు. వర్షాభావంతో రైతులు నష్టపోకుండా సబ్సిడీపై సీడ్‌బాల్స్ అందించే అంశాన్ని పరిశీలించాలని ఆదేశించారు. గోదావరి-కావేరి అనుసంధానంపై కేంద్రం సానుకూలంగా ఉందని, ఏపీ, కర్ణాటక, తమిళనాడుతో పాటు తెలంగాణకూ ఎంతో ప్రయోజనమని సీఎం వివరించారు. బనకచర్ల మీదుగా గోదావరి-కావేరి లింక్‌తో తమిళనాడు, కర్ణాటక ప్రాంతాల్లో ఘర్షణ వాతావరణం తగ్గడంతో పాటు తమిళనాడులో తాగునీటి సమస్యకు చెక్ పెట్టొచ్చని తెలిపారు. పొగాకు రైతుల సమస్యల పరిష్కారానికి మూడు ప్రతిపాదనలపై క్యాబినెట్‌లో చర్చ జరిగింది. పొగాకు రైతులకు రూ.60 వేలు వడ్డీ లేని రుణం ఇవ్వడం.. లోగ్రేడ్ రకానికి పొగాకు బోర్డు నుంచి వయబిలిటీ గ్యాప్ ఫండ్ (వీజీఎఫ్) ఇవ్వడం.. ఆథరైజ్డ్ క్రాప్ (నిర్దేశిత విస్తీర్ణంలో పొగాకు సాగు) వేసిన వారికి ఆర్థిక సాయం చేయాలన్న ఈ మూడు ప్రతిపాదనల కంటే.. వారి రుణాలను రీషెడ్యూల్ చేస్తే చాలా ఉపయోగకరంగా ఉంటుందని కొందరు మంత్రులు సూచించారు. వీటిలో రైతులకు ఏది ఉపయుక్తంగా ఉంటుందో పరిశీలించాలని సీఎం కోరారు. పొగాకు బోర్డు అధికారులు శుక్రవారం వస్తున్నారని, వారితో చర్చల అనంతరం దీనిపై మరింత స్పష్టత వస్తుందని అన్నారు.

# నాలుగో రోజూ స్తంభించిన పార్లమెంట్

- నీట్‌పై చర్చకు సిద్ధమన్న ప్రభుత్వం - ధర్మేంద్ర రాజీనామాకు విపక్షాలు పట్టు
- బాధ్యులపై ప్రభుత్వం కఠిన చర్యలు - రిజిజు, సీతారామన్, గోయల్ ప్రకటన



న్యూఢిల్లీ, జూలై 23:
ప్రతిపక్షాల నిరసనలతో పార్లమెంట్ ఉభయ సభలు నాలుగోరోజూ, గురువారం కూడా స్తంభించిపోయాయి. నీట్‌పై చర్చించడానికి సిద్ధమేనని కేంద్రప్రభుత్వం ప్రకటించినప్పటికీ.. విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, విద్యార్థుల పట్ల పోలీసుల క్రూరత్వంపైనా చర్చించాలని ప్రతిపక్షాలు పట్టుబట్టాయి. దీంతో ఎలాంటి కార్యకలాపాల్లేకుండా ఉభయ సభలు శుక్రవారానికి వాయిదా పడ్డాయి. విపక్షాల నిరసనల నేపథ్యంలో హోంమంత్రి అమిత్ షా లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కలుసుకున్నారు. అలాగే, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, ఎస్పీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్, టీఎంసీ ఎంపీలు సౌగతరాయ్, మహువా మొయిత్రా తదితరులూ స్పీకర్‌తో సమావేశమై చర్చించారు. నీట్ వ్యవహారంపై ప్రభుత్వం తన వైఖరిని వివరించేందుకు సిద్ధం గా ఉందని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ప్రకటించారు. తాము చర్చించడానికి సిద్ధంగా ఉన్నా ప్రతిపక్షాలే తప్పించుకుంటున్నాయని ఆయన ఆరోపించారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ.. నీట్ పేపర్ లీక్ కేసులో నిందితులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. విద్యార్థులకు న్యాయం చేసేందుకుసిద్ధంగా ఉన్నట్టు చెప్పారు. లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ చైర్‌పర్సన్ చర్చకు అంగీకరించినా, విపక్షం సభాకార్యకలాపాలకు అడ్డుపడుతోందని విమర్శించారు. పేపర్ లీక్ అంశంలో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రధాని మోదీ స్పష్టం చేసినట్టు వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. భవిష్యత్‌లో ఇలాంటివి పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ప్రకటించారు.

మిగతా 2లో...

# ఢిల్లీ అష్టదిగ్బంధనం

మెట్రో స్టేషన్ల మూసివేత
సెంట్రల్ ఢిల్లీలో మొబైల్ ఇంటర్నెట్ బంద్
అడుగడుగునా భద్రతాదళాలు, బారికేడ్లు
ఆంక్షలతో ఇబ్బందుల్లో ఢిల్లీ వాసులు.. క్యాబ్‌లు
ఆలజడి రేపటానికి బీజేపీ కుట్రలు:
అభిజిత్ దీప్కే





న్యూఢిల్లీ, జూలై 23 :
దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్‌మంతర్‌లో కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నిరసన కొనసాగుతోంది. గురువారం భారీ ఎత్తున యువత తరలివచ్చింది. ఢిల్లీ నలుమూలల నుంచేగాక దేశంలోని ఇతర ప్రాంతాల నుంచి కూడా యువతీ యువకులు స్వచ్ఛందంగా వచ్చి చేరుతున్నారు. దీంతో కేంద్రప్రభుత్వం భద్రతా చర్యలను మరింత తీవ్రతరం చేసింది. ప్రదర్శన స్థలం వద్ద భారీ ఎత్తున కేంద్ర బలగాలను మోహరించడమే కాక అడుగడుగునా బారికేడ్లను పలు వరసల్లో ఏర్పాటు చేశారు. పార్లమెంటుకు దారి తీసే పలు మార్గాల్లోనూ బారికేడ్లను నెలకొల్పారు. జంతర్‌మంతర్‌కు యువత రాకను అడ్డుకోవటానికి ఢిల్లీలోని 16 మెట్రోస్టేషన్లను మూసివేశారు. ఆయా స్టేషన్ల వద్ద బలగాలను మోహరించారు. ఫలితంగా నిత్యం రాకపోకలు సాగించే లక్షలాది మంది ఢిల్లీ వాసులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. సాయంత్రం వేళ మూడు స్టేషన్లను మాత్రం తెరిచారు. మిగిలిన వాటిని మూసే ఉంచారు.

మిగతా 2లో...

# సైన్యాన్ని దించండి..

పిటిషనర్ భూమికి రక్షణ కల్పించండి
హైడ్రా కమిషనరొస్తే బ్యారెక్‌లో పడేయండి
ప్రభుత్వ వ్యవస్థలపై నమ్మకం కోల్పోయాం
పదే పదే కోర్టు ధిక్కరణ అలవాటైపోయింది
రంగనాథ్ వ్యవహారశైలిపై హైకోర్టు ఆగ్రహం
ఏజీ విజ్ఞప్తితో అమలు ఒకరోజు వాయిదా



హైదరాబాద్, జూలై 23 :
శాంతా శ్రీరాం కన్‌స్ట్రక్షన్స్ భూముల వ్యవహారంలో హైడ్రా అనుసరిస్తున్న వైఖరి పట్ల గురువారం హైకోర్టు మరోసారి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. పిటిషనర్ కంపెనీకి చెందిన మల్కాజిగిరి మండలం లోతుకుంట గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 1, 2లలో ఉన్న 40 ఎకరాల ప్రైవేటు పట్టా భూమిలోకి వెళ్లరాదన్న ఉత్తర్వులను మరోసారి ఉల్లంఘించడంపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ తీరును హైకోర్టు తప్పుపట్టింది. ఈ భూమిలోకి వెళ్లరాదన్న హైకోర్టు ఉత్తర్వులను హైడ్రా ఉల్లంఘించడంతో ఏకంగా మూడు కోర్టు ధిక్కరణ పిటిషన్లు దాఖలయ్యాయి. హైకోర్టు ఆదేశం మేరకు ఈ నెల 20న హైడ్రా కమిషనర్ రంగనాథ్ ప్రత్యక్షంగా హైకోర్టు ఎదుట హాజరై వివరణ ఇచ్చారు. రంగనాథ్ హాజరైన తర్వాత కూడా తమ భూముల్లోకి హైడ్రా అధికారులు ప్రవేశించారని, ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళుతుందని, అప్పటిదాకా ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని హెచ్చరించారని పేర్కొంటూ పిటిషనర్ కంపెనీ గురువారం మరోసారి హైకోర్టును ఆశ్రయించింది. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న కోర్టు ధిక్కరణ పిటిషన్లకు అదనంగా మరో అప్లికేషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై జస్టిస్ జూకంటి అనిల్ కుమార్ ధర్మాసనం విచారణ చేపట్టింది. "ఆ భూముల్లోకి ప్రవేశించబోమని స్వయంగా అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి కోర్టుకు అండర్‌టేకింగ్ ఇచ్చారు. అడ్వకేట్ జనరల్ హామీ ఇచ్చిన తర్వాత కూడా హైడ్రా దుస్సాహసానికి పాల్పడుతూ మళ్లీ ఆ భూమిలోకి ప్రవేశించడం అక్రమం. పదే పదే కోర్టు ధిక్కరణకు పాల్పడుతున్నారు. ఏజీ ఇచ్చిన హామీ సైతం ఉల్లంఘించిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ వ్యవస్థలపై మేం విశ్వాసం కోల్పోయాం.

మిగతా 2లో...

MANA SAMAJAM
మన సమాజం
తెలుగు డిజిటల్ దినపత్రిక
శుక్రవారం, జులై 24, 2026

# క్రాంతి నగర్ కాలనీలో రూ.2 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన





**నిజాంపేట్, జులై 23 :**
బాచుపల్లి డివిజన్ పరిధిలోని క్రాంతి నగర్ కాలనీలో సీఎంసీ నిధులతో మంజూరైన రూ.2 కోట్ల విలువైన రోడ్లు, పార్క్ అభివృద్ధి మరియు సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఈరోజు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా హన్మంతరెడ్డి మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని, కాలనీల అభివృద్ధికి అవసరమైన ప్రతి పనిని దశలవారీగా పూర్తి చేయడానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ సర్కిల్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, డీసీసీ జనరల్ సెక్రటరీ రాజిరెడ్డి, మాజీ కార్పొరేటర్ వీరేందర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు జీవన్ రెడ్డి, నిజాంపేట్ డివిజన్ అధ్యక్షులు మురళి, నర్సింగరావు, కాలనీ సభ్యులు బుగ్గ రెడ్డి, రాజసుర, నవీన్, వంశీ, శ్రీధర్, హరి, కృష్ణ, రఘు తదితరులు మరియు కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అభివృద్ధి పనుల నాణ్యత పై ఉన్నతాధికారులతో,ఎమ్మెల్యే సమీక్ష



**నిజాంపేట్, జులై 23 :**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో సుమారు రూ.20 కోట్ల వ్యయంతో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా, నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా పూర్తి చేయాలని బీఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ సంబంధిత శాఖల ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా పేట్ బషీరాబాదు లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో నియోజకవర్గంలోని రహదారుల నిర్మాణం, విద్యుత్ సేవలు, పారిశుద్ధ్య నిర్వహణ, పార్కుల అభివృద్ధి, వీధి దీపాల ఏర్పాటు, వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చేపట్టాల్సిన ముందస్తు చర్యలు, అలాగే పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులతో ఎమ్మెల్యే సమగ్రంగా సమీక్షించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రతి అభివృద్ధి పనిని నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని, పనుల నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడవద్దని అధికారులను ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, సమస్యలపై వెంటనే స్పందించి పరిష్కార చర్యలు చేపట్టాలని, క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ నిర్వహించాలని సూచించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ , మంజూరైన నిధులను సమర్థవంతంగా వినియోగించి ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో సంబంధిత శాఖల ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గ్లోబరీనా.. కేటీఆర్.. (మొదటిపేజీ తరువాయి)

పరీక్షా పత్రాలు దిద్దే కాంట్రాక్టును అక్రమంగా కట్టబెట్టారని ముఖ్యమంత్రి ఆరోపిం చారు. ఆ కంపెనీ తప్పిదాల వల్ల 2019లో 27 మంది ఇంటర్ విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారని అన్నారు. అప్పుడే ఆ కంపెనీని బ్లాక్‌లిస్ట్‌లో పెట్టి, క్రిమినల్ కేసు కట్టి లోపల వేయాల్సి ఉందని చెప్పారు. కేసీఆర్ అలా చేయకుండా వదిలేయడం వల్ల ఆ కంపెనీ కో ఎంప్ట్‌గా పేరు మార్చుకుని సీబీఎస్సీ ప్రశ్నాపత్రాలు దిద్దే కాంట్రాక్టు పొందిందని అన్నారు. సీబీఎస్సీ పరీక్షల నిర్వహణలోనూ ఇవే తప్పులు జరిగాయన్నారు. ఈ అవకతవకల ఆదర్శంగానే నీట్ కుంభకోణం జరిగిందని ఆరోపించారు. గ్లోబరీనా సంస్థతో కేటీఆర్‌కు ఏ సంబంధం లేకుంటే ఆ కంపెనీ అవకతవకలపై విచారణ కోరుతూ సీసీఎ?సలో ఫిర్యాదు చేయాలని డిమాండ్ చేశారు. ఆయన ఫిర్యాదు చేస్తే విచారణ జరిపి జన్వాడ ఫామ్ భూములు ఏ రాజుల నుంచి కేటీఆర్‌కు వచ్చాయి? గ్లోబరీనా కంపెనీలో ఉన్నది ఏ రాజులు? ఆ రాజుల వెనుక ఉన్న యువరాజు? ఎవరు అన్న వివరాలు, లావాదేవీలు అన్నీ బయటికి వస్తాయని చెప్పారు. ఇప్పటికే విజిలెన్స్ విచారణ జరుగుతోందని, నివేదిక కోసం ఎదురు చూస్తున్నామని తెలిపారు. గ్లోబరీనా వ్యవహా రంపైన కేటీఆర్ క్షమాపణలు చెప్పి, అమర వీరుల స్థూపం వద్ద ముక్కు నేలకు రాసి, ఆ తర్వాత మాట్లాడాలని డిమాండ్ చేశారు. కేటీఆర్ తనపై వేసిన పరువు నష్టం దావా విషయంలో ముఖ్యమంత్రి స్పందిస్తూ, పరువు ఉన్నవాళ్లు వేస్తే దాన్ని పరువు నష్టం దావా అంటారన్నారు. నీట్ ప్రశ్నాపత్రాల లీక్‌పై దొంగలు పడ్డ ఆరు నెలలకు కుక్కలు మొరిగినట్లుగా కేటీఆర్ ఇప్పుడు ధర్నా చేస్తున్నాడని ఎద్దేవా చేశారు. పిల్లలు రోడ్లపైన దెబ్బలు తింటుంటే వెంటనే ఎందుకు రోడ్లపైకి రాలేదని ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో కేంద్ర మంత్రి ధర్మేంధ్ర ప్రదాన్ రాజీనామాను బీఆర్ఎస్ ఎందుకు కోరట్లేదని నిలదీశారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ధర్నా చౌక్‌నే మూసేశారని, తాము అధికారంలోకి వచ్చిన తర్వాత తెరిచిన ధర్నా చౌకే ఇప్పుడు కేటీఆర్ ధర్నా చేయడానికి దిక్కయిందని వ్యాఖ్యానించారు. డిసెంబర్ 7, 2023 తర్వాత తమ ప్రభుత్వం చేసిన నియామకాలపై వివరాలు ఇవ్వాలంటూ అసెంబ్లీలో కేసీఆర్ ప్రశ్నిస్తే పేర్లు సహా అన్ని వివరాలూ ఇస్తామన్నారు. పదేళ్లలో గ్రూప్ 1 నియామకాలు చేపట్టలేక పోయారని, తాను కోర్టు కేసులు క్లియర్ చేసి ఒక్క ఏడాదిలోనే గ్రూప్ 1 నియామకాలు పూర్తి చేశానని చెప్పారు.

**కేసీఆర్ అందుకే హరీశ్ పదవి పీకాడు**

కాళేశ్వరంలో భాగంగా మూడు బ్యారేజీల నిర్మాణంలో టెక్నాలజీ మ్యానిపులేషన్ చేసి కాంట్రాక్టర్ల నుంచి వందల కోట్ల రూపాయలు తీసుకున్నందుకే హరీశ్‌రావు నుంచి ఇరిగేషన్ శాఖను కేసీఆర్ ఊడబీకాడని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఆ శాఖకు హరీశ్‌రావు మంత్రిగా ఉన్నప్పుడే మూడు బ్యారేజీలు కట్టారని గుర్తు చేశారు. ఆ బ్యారేజీలను ఏ టెక్నాలజీలో కట్టాలని వ్యాప్కోస్ ప్లాన్ ఇచ్చింది, ఏ టెక్నాలజీతో కట్టారని ఈ సందర్భంగా రేవంత్‌ప్రశ్నించారు. కాళేశ్వరం గురించి మాట్లాడే ముందు.. తన నుంచి కేసీఆర్ ఇరిగేషన్ శాఖను ఎందుకు ఊడబెరికారో హరీశ్‌రావు సమాధానం చెప్పాలన్నారు. హరీశ్ చెప్పినట్లుగా పారే నీళ్ల నుంచి నీటిని ఎత్తే అవకాశం ఉంటే బ్యారేజీలు ఎందుకు కట్టినట్లని ప్రశ్నించారు. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీల్లో గేట్లు దించి నీళ్లు ఆపితే మొత్తం కుప్పకూలుతుందని ఎన్డీఎస్ఏ స్పష్టంగా చెప్పిందన్నారు. పరీక్షలు జరిపి చర్యలు తీసుకున్న తర్వాతే పునరుద్ధరణ చేపట్టాలని ఆదేశించిందని తెలిపారు. కన్నెపల్లి పంప్ హౌస్ ద్వారా నీళ్లు ఎత్తాలంటే మేడిగడ్డ గేట్లు దించి కనీసంగా 5 టీఎంసీల నీటిని నిల్వ చేయాల్సి ఉంటుందని చెప్పారు. కన్నెపల్లి పంపుల ద్వారా అన్నారంలో నీళ్లు ఎత్తి పోసి.. అక్కడి నుంచి లక్ష్మీ పంప్ హౌస్ ద్వారా సుందిళ్లకు నీళ్లు ఎత్తి పోసి.. అక్కడి నుంచి సరస్వతి పంప్ హౌస్ ద్వారా ఎల్లంపల్లికి నీళ్లు ఎత్తి పోయాల్సి ఉంటుందని వివరించారు. అన్నారం నుంచి లక్ష్మీ పంప్ హౌస్ ద్వారా సుందిళ్లకు నీళ్లు ఎత్తి పోయాలంటే అన్నారం బరాజ్ గేట్లు దించి 16 మీటర్ల ఎత్తులో నీళ్లు నిలబెట్టాల్సిందేనని చెప్పారు. సుందిళ్ల నుంచి సరస్వతీ పంప్ హౌస్ ద్వారా ఎల్లంపల్లికి నీళ్లు ఎత్తాలన్నా సుందిళ్ల గేట్లు మూయాల్సిందే నన్నారు. మూడు బరాజ్‌ల గేట్లు మూసి, 3 పంప్ హౌస్‌లు ఒకే సారి నడిపిస్తే గానీ ఎల్లంపల్లికి నీళ్లు ఎత్తిపోయలేమని చెప్పారు. కాళేశ్వరం అక్రమాలపై విచారణ జరపాలని సీబీఐకి అప్పగిస్తే కేంద్రంతో మేనేజ్ చేసుకున్న ధైర్యంతో హరీశ్ ఉల్టా దాడి మొదలు పెట్టారని వ్యాఖ్యానించారు.

**కుటుంబంలో ఒక్కరైనా రక్తం ఇచ్చారా?**

పదేళ్ల పాటు రాష్ట్రాన్ని దోచుకుని కొవ్వుపట్టిన కుటుంబంలో ఒక్కరన్నా మొన్నటి బీఆర్ఎస్ రక్తదానం కార్యక్రమంలో రక్తం ఇచ్చారా? అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. "ఉద్యమ సమయంలో పిల్లల ప్రాణాలు తీసుకున్నరు. అధికారంలోకి వచ్చాక ప్రజల సొమ్ము దోచారు. ప్రతిపక్షంలోకి వచ్చాక ప్రజల రక్తం అమ్ముకున్నరు. తీసిన రక్తం గాంధీకో, ఉస్మానియాకో ఇస్తే పేద ప్రజలకన్నా ఉపయోగపడేది కదా?" అన్నారు. 2025 గ్లోబల్ సమ్మిట్ జరిగినప్పుడు రూ.లక్ష కోట్లు పెట్టుబడి పెట్టిన కంపెనీ తన కార్యాలయం ఎక్కడ పెట్టుకుంటుందో ఆ లేన్‌కు పేరు సదరు కంపెనీది పెడతామని నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. ట్రంప్ కంపెనీ పెట్టుబడులు పెడుతున్న నేపథ్యంలో కాన్సులేట్ దారికి ఆయన పేరు పెట్టామని వివరించారు. 2023 అసెంబ్లీ ఎన్నికల నుంచి ఇటీవలి మున్సిపల్ ఎన్నికల వరకు తన అంచనాలు, బీఆర్ఎస్ అంచనాలూ చూడాలని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో 30 వేల ఓట్ల మెజారిటీతో గెలుస్తామని చెప్పానని గుర్తు చేశారు. ఎంపీ సీట్లు బీఆర్ఎస్‌కు గుండు సున్న అని చెప్పానని, సర్పంచ్ ఎన్నికల్లో టూ థర్డ్ సీట్లు, మున్సిపల్ ఎన్నికల్లో డిస్టింక్షన్ సాధిస్తామని చెప్పానని, అదే జరిగిందని ప్రస్తావించారు. బీఆర్ఎస్ అవయవదానంతో లోకసభ ఎన్నికల్లో బీజేపీ గెలిచిందని, గజ్వేలు, సిరిసిల్ల, సిద్దిపేటల్లోనూ బీజేపీకి మెజార్టీ వచ్చిందని ప్రస్తావించారు.

**నాకు 2 ఓట్లు ఉంటే.. పోలీస్ కంప్లయింట్ ఇవ్వండి**

తనకు రెండు ఓట్లు ఉన్నట్లయితే పోలీసు కంప్లయింట్ ఇవ్వాలని, దానిపై విచారణ చేయిస్తామని బీఆర్ఎస్ నేతలకు సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. తప్పుడు కేసు అయితే పెట్టినవాడిని లోపల వేయిస్తానన్నారు. జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తు పెట్టుకుని తన ఓటును తన ఊరి నుంచి కొడంగల్‌కు మార్పించుకున్నానని ముఖ్యమంత్రి వివరించారు. కొడంగల్ నియోజకవర్గం మొదట కర్ణాటకలో ఉండేదని, భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడినప్పుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కలిసిందని చెప్పారు. ఎస్ఐఆర్‌లో ఓటు పోతే సర్వమూ పోయినట్లేనని, ఓట్లు కాపాడేందుకే ఆగస్టు 3 ఎన్యుమరేషన్ ప్రక్రియ పూర్తయ్యే వరకూ గాంధీభవన్‌కు రావద్దని నేతలకు చెప్పానన్నారు. ఎన్యుమరేషన్ 70 శాతం మాత్రమే పూర్తయిందని, కార్యకర్తలు పూనుకుంటే తప్ప ఇది ముందుకు పోదని వ్యాఖ్యానించారు. ఓటర్ల గురించి బీఎల్‌వోల కన్నా బీఎల్ఏలకే ఎక్కువ తెలుస్తుందని అన్నారు. భూమి, ఇల్లు లేనివారికి గుర్తింపును ఇచ్చేది ఓటరు కార్డు, ఆధార్, రేషన్ కార్డులేనని చెప్పారు. ఎస్ఐఆర్‌ను అడ్డం పెట్టుకుని కాంగ్రెస్ ఓట్లు కొట్టేస్తున్నారని, ఈ విషయంలో బీజేపీకి కుల గురువు కేసీఆరేనని ఆరోపించారు. జీహెచ్ఎంసీ కమిషనర్‌గా సోమేష్ కుమార్ ఉన్నప్పుడు 28 లక్షల మంది ఆంధ్రా ఓటర్ల ఓట్లు తీసేయించారని ఆరోపించారు. మర్రి శశిధర్‌రెడ్డి కోర్టుకు వెళితే 15 లక్షల ఓట్ల పునరుద్ధరణ జరిగిందని వివరించారు.

# ఢిల్లీ లో విద్యార్థుల పై లాఠీచార్జీని వ్యతిరేకిస్తూ సిపిఐ నిరసన



**నిజాంపేట్, జులై 23 :**
భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) రాష్ట్ర సమితి పిలుపుమేరకు బాచుపల్లి మండల కమిటి ఇతర సిపిఐ నాయకులు 'ఢిల్లీలో విద్యార్థులపై సభ్య సమాజం సిగ్గుపడే విధంగా మోడీ ప్రభుత్వం చేసిన లాటిచార్జి నీ వ్యతిరేకిస్తూ' అలాగే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేదర్ ప్రధాన్ రాజీనామా చేయాలనీ అంబేద్కర్ విగ్రహం వద్ద ప్ల కార్డులతో నిరసన వ్యక్తం చేశారు.

# ఢిల్లీ అష్టదిగ్బంధనం.. (మొదటిపేజీ తరువాయి)

మరోవైపు,జంతర్‌మంతర్ చుట్టూ 1.5 కి.మీ.ల పరిధిలో సెంట్రల్ ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో మొబైల్ ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు. దీంతో క్యాబ్‌లు, ఆటోలను కూడా బుక్ చేసుకోలేక జనం ఎక్కడికక్కడ చిక్కుకుపోయారు. డిజిటల్ పేమెంట్లు చేయలేక ఇబ్బందులకు గుర య్యారు. ఇన్ని అడ్డంకులు సృష్టిస్తున్నా జంతర్‌మంతర్ వద్ద సందడి తగ్గటం లేదు. యువత వస్తూనే ఉంది. 'ధరేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి', 'వందేమాతరం', 'భారత్‌మాతా కీ జై', 'విప్లవం వర్ధిల్లాలి' వంటి నినాదాల హోరు కొనసాగుతోంది. జంతర్‌మంతర్ వద్ద అలజడి సృష్టించి పోలీసుల తో మరోమారు లాఠీచార్జి జరిపించాలన్న కుట్రతో బీజేపీ గూండాలను పంపిస్తోందని సీజేపీ అధ్యక్షుడు అభిజిత్ దీప్కే ఆరోపించారు. ఇటువంటి వ్యక్తులు కనిపిస్తే బయటకు పంపించివేయాలని నిరసనకారులకు పిలుపునిచ్చారు. కొందరు సాధారణ దుస్తుల్లో ఉన్న వాళ్లు కూడా లాఠీలు పట్టుకొని తమ మీద దౌర్జన్యం చేస్తున్నారని, ఒక వ్యక్తి మీద దాడి చేశారని సీజేపీ ప్రతినిధి సౌరవ్‌దాస్ పేర్కొన్నారు. ఈ మేరకు సోషల్‌మీడియాలో ఓ వీడియోను పోస్ట్ చేశారు.

# యువత భవితే.. (మొదటిపేజీ తరువాయి)

కాబట్టి, ఈ చర్యలు ఎంతమా త్రం సరిపోవు' అని పేర్కొన్నారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ఏర్పాటు సమస్యకు పరిష్కారం కాదన్నారు. 'దేశంలో ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఉన్నా పేపర్ లీకేజీలు జరుగుతున్నాయి.. దానికి కారణం కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అస మర్థత. ఎటువంటి లోపాలకు తావు లేని సమర్థమైన పరీక్షల వ్యవస్థను నెలకొల్పటంలో ఆయన విఫలమయ్యారు. ఈ దేశ యువత ఒకే ఒక్కటి డిమాండ్ చేస్తోంది.. అది జవాబు దారీతనం మాత్రమే' అని తెలిపారు. ప్రధాని మోదీ ప్రకటన.. అసలు డిమాండ్ల నుంచి దృష్టి మళ్లించే యత్నమని, దేశంలోని లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుపై అది ఒక క్రూరమైన జోక్ అని ఆరోపించారు. తాము సుదీర్ఘమైన న్యాయప్రక్రియలను కోరుకోవటం లేదని, తక్షణ న్యాయా న్ని, జవాబుదారీతనాన్ని అడుగుతున్నామని.. ధర్మేంద్ర ప్రధాన్‌పై చర్యలు తీసుకోవటంతో దానిని ప్రారంభిం చాలని అశు తోష్ రంకా డిమాండ్ చేశారు. విద్యామంత్రి రాజీనామా చేసేంతవరకూ తాము జంతర్‌మంతర్ నుంచి కదిలేది లేదని స్పష్టం చేశారు. ప్రస్తుతం ప్రజాగ్రహం మోదీ మీదకు కూడా మళ్లుతోందని, పేపర్ లీకేజీలను, విద్యార్థుల నిరసనను ఆయన ఎందుకు పట్టించుకోలేదని నినాదాలు ఇస్తున్నారని అశుతోష్ రంకా పేర్కొన్నారు.

# నాలుగో రోజూ... (మొదటిపేజీ తరువాయి)

ఈ అంశాన్ని రాజకీయం చేయొద్దని కోరారు. న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్‌మేఘవాల్ స్పందిస్తూ.. ఫాస్ట్‌ట్రాక్ కోర్టును ఏర్పాటు చేయడం కీలకమైన నిర్ణయమన్నారు. నీట్ పేపర్ లీక్‌లో బాధ్యులపై వేగంగా చర్యలు తీసుకోవాలన్న విద్యార్థుల డిమాండ్‌కు ఇది పరిష్కారం చూపుతుందన్నారు. మరోవైపు, నీట్ పేపర్ లీకేజీ అంశంపై పార్లమెంట్‌లో చర్చిద్దామంటే, ప్రతిపక్ష కాంగ్రెస్ పారిపోతోందని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ విమర్శించారు. పార్లమెంట్‌లో చర్చిస్తే తమ ద్వంద్వ ప్రమాణాలు బయటపడతాయని భయపడుతోందన్నారు. పార్లమెంటు మకరద్వారం వద్ద అధికార, ప్రతిపక్షాలు వేర్వేరుగా నిరసన ప్రదర్శనలు నిర్వహించాయి. విపక్షాల నిరసనల్లో కాంగ్రెస్ నేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీతో పాటు పలువురు ప్రతిపక్ష ఎంపీలు పాల్గొన్నారు. విద్యామంత్రి రాజీనామా చేయాలని ఏఐసీసీ చీఫ్ ఖర్గే డిమాండ్ చేశారు. మరోవైపు నీట్‌పై ప్రతిపక్షాలు రాజకీయాలు చేస్తున్నాయంటూ ఎన్డీఏ ఎంపీలు కూడా ప్రదర్శన నిర్వహించారు.

# సైన్యాన్ని దించండి.. (మొదటిపేజీ తరువాయి)

మా ఆదేశాలను అమలు చేయించడానికి ఆర్మీని రంగంలోకి దించక తప్పదు. పిటిషనర్ స్థలంలోకి ప్రవేశిస్తే హైడ్రా అధికారులను వాహనాలతో సహా అదుపులోకి తీసుకోండి. అక్కడికి వస్తే హైడ్రా చీఫ్ రంగనాథ్‌ను సైతం అదుపులోకి తీసుకొని ఆర్మీ బ్యారెక్‌లో పడేయండి. ఇలాంటి వ్యవహారాల్లో ఆర్మీని మోహరించడం సమంజసం కాదని మాకు తెలుసు. రాష్ట్ర ప్రభుత్వ వ్యవస్థలపై మేం విశ్వాసం కోల్పోయాం. ఇక తప్పని పరిస్థితి ఏర్పడింది. సచివాలయంలో కూర్చున్న వారికి కూడా ఏం జరుగుతుందో తెలియాలి. హైకోర్టు ఇచ్చిన ఈ ఆదేశాలను హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ ఆర్మీ అధికారులకు తెలియజేయాలి. బైసన్ డివిజన్‌లోని సీనియర్ బ్రిగేడియర్, మరో పది మంది ఆర్మీ ఫోర్స్‌ను పిటిషనర్ భూమి వద్ద మోహరించాలి. అక్కడికి వచ్చే హైడ్రా అధికారులను ఎత్తేసి ఆర్మీ బ్యారెక్‌లో పడేయండి. వాహనాలను సీజ్ చేయండి" అని ఈ సందర్భంగా ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఉదయం ఆదేశాలు జారీ చేయగా మధ్యాహ్నం తర్వాత అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి స్వయంగా జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం ఎదుట హాజరై ఈ విషయాన్ని ప్రస్తావించారు. పిటిషనర్ ఆరోపణలు సమంజసం కాదని, వివరణ ఇవ్వడానికి ఒక్క రోజు సమయం ఇవ్వాలని కోరారు.

# బిఎస్ఎన్ఎల్‌లో రూ.80 లక్షల
# కాపర్ కేబుల్ మాయం?

## రోడ్డు విస్తరణలో బయటపడిన విలువైన కేబుల్ లెక్కలు ఏమయ్యాయి?

**భద్రపరిచారా.. దొంగల పాలైందా.. లేక స్క్రాప్‌గా అమ్మేశారా?**

**బిఎస్ఎన్ఎల్ కార్యాలయం చుట్టూ సీసీ కెమెరాలు ఉన్నా కేబుల్ చోరీపై నో కేసు ఎందుకు?**

**బిఎస్ఎన్ఎల్ సిబ్బంది పాత్రపై అనుమానాలు..**




**మంచిర్యాల,జూలై 23,(మన సమాజం):**
జిల్లా కేంద్రంలోని బి ఎస్ఎన్ఎల్ కార్యాలయంలో భారీ విలువైన కాపర్ కేబుల్ వ్యవహారం ప్రస్తుతం తీవ్ర చర్చకు దారితీస్తోంది. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా రైల్వే స్టేషన్ నుంచి ఓవర్ బ్రిడ్జి వరకు చేపట్టిన తవ్వకాల సమయంలో బయటపడిన బిఎస్ఎన్ఎల్ సంస్థ కు చెందిన కాపర్ కేబుల్స్ విలువ సుమారు రూ.60 లక్షల నుంచి రూ.80 లక్షల వరకు ఉంటుందని సమాచారం. ఇంత భారీ విలువైన కేబుల్ బయటపడిన తర్వాత దానిని బిఎస్ఎన్ఎల్ అధికారులు ఎక్కడికి తరలించారు? ఎంత మొత్తంలో కేబుల్‌ను స్వాధీనం చేసుకున్నారు? కార్యాలయంలో ఏ గదిలో భద్రపరిచారు? ప్రస్తుతం ఆ కేబుల్ మొత్తం ఉందా? లేక కొంతమేర మాయమైందా? అన్న ప్రశ్నలు ఇప్పుడు తీవ్ర అనుమానాలకు తావిస్తున్నాయి. రూ.60--80 లక్షల విలువైన కేబుల్ విషయంలో అధికారిక రికార్డులు ఉన్నాయా? కేబుల్‌ను కార్యాలయంలో భద్రపరిచి ఉంటే స్టాక్ రిజిస్టర్‌లో నమోదు చేశారా? భద్రపరిచిన గదికి భద్రత కల్పించారా? ఒకవేళ కేబుల్ చోరీకి గురైతే పోలీసులకు ఫిర్యాదు చేసి కేసు నమోదు చేయించారా? అనే ప్రశ్నలకు సమాధానాలు రావాల్సి ఉంది. అంతేకాకుండా బిఎస్ఎన్ఎల్ కార్యాలయం చుట్టూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఉన్నప్పటికీ, కేబుల్ చోరీకి గురైతే దొంగలను గుర్తించేందుకు అధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేదనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కార్యాలయంలో దొంగతనం జరిగిందా? జరిగితే ఎంత కేబుల్ పోయింది? పోలీసులకు ఫిర్యాదు ఎందుకు చేయలేదు? అనే ప్రశ్నలు పట్టణంలో చర్చనీయాంశంగా మారాయి. మరోవైపు విలువైన కాపర్ కేబుల్‌ను నిబంధనలకు విరుద్ధంగా స్క్రాప్‌గా విక్రయించారా? లేక దొంగలతో కుమ్మక్కై కేబుల్‌ను వారికి అప్పగించారా? అనే అనుమానాలు కూడా స్థానికంగా వ్యక్తమవుతున్నాయి. అయితే ఇవి ప్రస్తుతానికి ఆరోపణలు, అనుమానాలు మాత్రమే కాగా, వీటిపై అధికారికంగా ఎలాంటి నిర్ధారణ లేదు. కేబుల్ తరలింపు నుంచి భద్రపరచడం వరకు, అక్కడి నుంచి దాని ప్రస్తుత పరిస్థితి వరకు పూర్తి వివరాలను ఉన్నతాధికారులు బయటపెట్టాల్సిన అవసరం ఉంది. కేబుల్ వ్యవహారంలో ఎవరి పాత్ర ఎంత? అసలు రూ.60--80 లక్షల విలువైన కాపర్ కేబుల్ ప్రస్తుతం ఎక్కడ ఉంది? రికార్డుల్లో ఎంత ఉంది? వాస్తవంగా ఎంత ఉంది? అనే అంశాలపై ఉన్నతస్థాయి విచారణ జరిపితేనే అసలు నిజాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. బిఎస్ఎన్ఎల్ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి సమగ్ర విచారణకు ఆదేశించాలని, అవసరమైతే పోలీసులకు ఫిర్యాదు చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం లేకపోలేదు.

# తండ్రి కొడుకుల
# వడ్డీ వ్యాపారం దందా..?

- అప్పుల ఊబిలో చిక్కుకుని ఆస్తులు వదిలేసుకుంటున్న బాధితులు..
- ఫిర్యాదు చేయాలన్నా వేధింపుల భయంతో మిన్నకుండి పోతున్న తీరు..!
- కుమారస్వామి, రాజ్‌కుమార్‌లపై తీవ్ర ఆరోపణలు..
- అత్యవసర అప్పులకు భారీ వడ్డీలు, ప్లాట్లు - భూములు
- బంగారం తాకట్టు
- చివరికి ఇళ్ళను కూడా పెట్టుకుంటున్నారంటూ ఆవేదన
- అప్పు చెల్లించలేక ఆస్తులు కోల్పోతున్న పలువురు..
- పోలీసులను ఆశ్రయించాలన్నా మరింత వేధింపులకు గురవుతామనే మౌన వేదన..!
- భయంతో గుట్టుచప్పుడు కాకుండా బతుకుతున్నామని ఆవేదన



**మంచిర్యాల,జూలై 23,(మన సమాజం):**
**జిల్లా కేంద్రంలో వడ్డీ వ్యాపారం పేరుతో కుమారస్వామి, ఆయన కుమారుడు రాజ్‌కుమార్ ఆర్థిక అరాచకం జరుపుతున్నారని ఎదుర్కొంటున్న ఆరోపణలు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారాయి. అత్యవసరంగా డబ్బులు అవసరమైన వారికి అప్పులు ఇస్తూ భారీ మొత్తంలో వడ్డీలు వసూలు చేస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. ఒక లక్ష రూపాయలకు రోజుకు 3 వేల చొప్పున వడ్డీ వసూలు చేస్తున్నారని, అప్పులకు భద్రతగా ప్లాట్లు, భూములు, బంగారం, ఇళ్లను తాకట్టు పెట్టించుకుంటున్నారని వారు వాపోతున్నారు. వడ్డీ పై వడ్డీ పెరుగుతూ అసలు అప్పు తీర్చడం సాధ్యం కాక, చివరకు ఆస్తులను సైతం వదులుకోవాల్సిన దుస్థితి కొందరికి ఏర్పడిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పూర్తి వివరాల్లోకి వెళితే...**

ఇప్పటికే ఈ తండ్రి కొడుకుల వద్ద అప్పులు తీసుకున్న కొంత మంది బాధితులు అప్పులు తీర్చలేక తమ ఆస్తులను సైతం కోల్పోయే పరిస్థితికి చేరుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అప్పు చెల్లించడంలో ఆలస్యం జరిగితే తీవ్ర ఒత్తిళ్లు, వేధింపులు ఎదుర్కోవాల్సి వస్తోందని, కొన్నిసార్లు తమ ఇళ్ల వద్దే మకాం వేసి ఒత్తిడి తెస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. మరోవైపు అప్పులు తీసుకున్న కుటుంబాల్లోని మహిళలను సైతం లక్ష్యంగా చేసుకుని ఇబ్బందులకు గురి చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలన్నింటినీ సంబంధిత అధికారులు సమగ్రంగా విచారించి వాస్తవాలను నిర్ధారించాల్సిన అవసరం ఉంది.

### ఫిర్యాదు చేస్తే మరిన్ని ఇబ్బందులని మౌనం..?

తమ పై జరుగుతున్న వేధింపులపై పోలీసులను ఆశ్రయించాలని కొంత మంది భావిస్తున్నప్పటికీ, ఫిర్యాదు చేస్తే భవిష్యత్తులో తమకు మరింత ఇబ్బందులు ఎదురవుతాయేమోననే భయంతో వెనుకడుగు వేస్తున్నారని తెలుస్తోంది. “పోలీసులకు ఫిర్యాదు చేస్తే ఇంకా ఎలాంటి వేధింపులు ఎదురవుతాయోనన్న భయంతో గుట్టుచప్పుడు కాకుండా బతకాల్సిన పరిస్థితి ఏర్పడింది” అంటూ బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. అధిక వడ్డీల వసూళ్లు, ఆస్తుల తాకట్టు, అప్పుల వసూలు పేరుతో జరుగుతున్న ఒత్తిళ్లు, వేధింపులపై పోలీసులు, సంబంధిత అధికారులు తక్షణమే దృష్టి సారించి సమగ్ర విచారణ చేపట్టాలని బాధితులు కోరుతున్నారు. హైటెక్ సిటీ క్రాంతానికి చెందిన కుమారస్వామి, రాజ్‌కుమార్‌ల పై వస్తున్న ఆరోపణలపై వారి వివరణ తీసుకోవడంతో పాటు, బాధితుల నుంచి సమాచారం సేకరించి నిజానిజాలను వెలుగులోకి తేవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## రామన్నపేట నూతన సర్కిల్ ఇన్స్పెక్టర్ గా మోలుగూరి రవి

**యాదాద్రి జులై 23**
రామన్నపేట నూతన సర్కిల్ ఇన్స్పెక్టర్ గా మోలుగురి రవి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈయన డీటీసీ జడ్చర్ల మహబూబ్ నగర్ జిల్లా నుండి రామన్నపేట సీఐ గా బదిలీ అయ్యారు. ఇక్కడ ఉన్న సీఐ ఎన్. వెంకటేశ్వర్లు మల్టీ జోన్ 2 కు రిపోర్ట్ చేశారు. ఈ సందర్భంగా నూతన సీఐ మోలుగురి రవి మాట్లాడు తూ.. రామన్నపేట సర్కిల్ ప్రజలకు అందు బాటులో ఉంటూ శాంతి భద్రతలు పరిరక్షించడం జరుగుతుం దని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారి పట్ల కఠినంగా వ్యవహరి స్తామన్నారు. మహిళల పట్ల అసభ్య కరంగా ప్రవర్తిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే తమకు సమాచారం అందించాలని కోరారు.

## నీట్ విద్యార్థులకు సానియా మీర్జా మద్దతు

**న్యూఢిల్లీ, జూలై 23**



నీట్-యూజీ 2026 పేపర్ లీకేజీ ఆరోపణల నేపథ్యంలో ఆందోళన చేస్తున్న విద్యార్థులకు భారత టెన్నిస్ దిగ్గజం సానియా మీర్జా మద్దతు ప్రకటించింది. విద్యార్థుల ఆందోళనలను సాను భూతితో అర్థం చేసుకోవాలని, వారి వాదనలను ప్రభుత్వం వినాలని ఆమె కోరింది. దేశ విద్యా వ్యవస్థలో పారదర్శకతను పెంపొం దించేలా తక్షణ సంస్కరణలు చేపట్టాల్సిన అవసరం ఉందని పేర్కొంటూ సామాజిక మాధ్యమ వేదికలో ప్రకటన విడుదల చేసింది. నీట్ వంటి ప్రతిష్టాత్మక పోటీ పరీక్షల కోసం విద్యార్థులు ఎన్నో సంవత్సరాలు కష్టపడి సిద్ధమవుతారని, అలాంటి సమయంలో పరీక్షల నిర్వహణపై వివాదాలు తలెత్తడం వారి భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతుందని సానియా మీర్జా ఆవేదన వ్యక్తం చేసింది. విద్యార్థులే దేశ భవిష్యత్తుకు పునాది అని పేర్కొంటూ, వారి శ్రమకు తగిన గౌరవం లభించేలా చర్యలు తీసుకోవాలని కోరింది.పరీక్షల నిర్వహణ ప్రక్రియపై విద్యార్థుల్లో మళ్లీ విశ్వాసం నెలకొల్పడం అత్యంత అవసరమని ఆమె అభిప్రాయపడింది. పారదర్శ కమైన, నిష్పాక్షికమైన పరీక్షల నిర్వహణ ద్వారా మాత్రమే విద్యార్థుల నమ్మకాన్ని తిరిగి పొందగలమని పేర్కొంది. ఈ దిశగా సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది. సమాజంలో హింసకు ఎలాంటి స్థానం లేదని సానియా మీర్జా స్పష్టం చేసింది. యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అన్ని వర్గాలు శాంతియుత మార్గంలో సమస్యలకు పరిష్కారం కనుగొనాలని పిలుపునిచ్చింది. ప్రజాస్వామ్య బద్ధమైన పద్ధతుల్లోనే అభిప్రాయాలను వ్యక్తం చేయడం ద్వారా సానుకూల ఫలితాలు సాధించవచ్చని ఆమె పేర్కొంది.ఇదిలా ఉండగా, ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. పేపర్ లీకేజీ వ్యవహారంపై పూర్తి స్థాయి దర్యాప్తు చేపట్టాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని నిరసనకారులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, జాతీయ పరీక్షల నిర్వహణ సంస్థ పనితీరులో సమూల మార్పులు తీసుకురావాలని కోరుతున్నారు. నీట్-యూజీ పరీక్షల వ్యవహారంపై దేశవ్యాప్తంగా చర్చ కొనసాగుతున్న నేపథ్యంలో ప్రముఖులు కూడా తమ అభిప్రాయాలను వెల్లడిస్తున్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పారదర్శకమైన పరీక్షల నిర్వహణ, బాధ్యతాయుతమైన వ్యవస్థ ఏర్పాటు అవసరమని పలు వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఈ పరిణామాలపై సంబంధిత అధికారులు తీసుకునే నిర్ణయాలపై విద్యార్థులు, తల్లిదండ్రులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు

## టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం పై
## విద్యార్థులకు అవగాహన





**లక్షెట్టిపేట జులై 23**


**(మన సమాజం)**
కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం పై గురువారం నాడు లక్షెట్టిపేట ప్రభుత్వ మోడల్ డిగ్రీ కాలేజీ లో ఎన్ ఎస్ ఎస్ విభాగం విద్యార్థిని , విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగిందని టీబీ సూపర్ వైజర్ సురేష్ తెలిపారు. మంచిర్యాల జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ , టీబీ ప్రోగ్రామ్ ఆఫీసర్ సుధాకర్ నాయక్ ఆదేశాల మేరకు విద్యార్థులకు మోబైల్ ఫోన్ లలో టీబీ నిశ్చయ్ ఆప్ ఇన్స్టాల్ చేసి దాని గురించి వివరించడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా హెచ్ ఐవి ఎయిడ్స్ గురించి కౌన్సిలర్ ఆంజనేయులు, సీజనల్ వ్యాధుల గురించి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే విషయాలపై వెంకట్రావ్ పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ అసిస్టెంట్ గఫూర్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ మహాత్మా సంతోష్ ,ఎన్ ఎస్ ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ మాధవి సంతోష్ , లెక్చరర్స్ శ్రీనివాస్, సంధ్యారాణి, తదితరులు పాల్గొన్నారు.



## బాలీవుడ్ బాట పట్టిన మీనాక్షి

హిట్ 2, లక్కీభాస్కర్, సంక్రాంతికి వస్తున్నాం, అనగనగా ఒక రాజు చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు చేరువైన మీనాక్షి చౌదరి బాలీవుడ్ ఎంట్రీకి రంగం సిద్ధమైంది. అక్షయ్‌కుమార్ కథానాయకుడిగా రాజ్ శాండిల్య దర్శకత్వంలో రూపొందుతోన్న 'భాగమ్ భాగ్ 2'లో ఈ ముద్దుగుమ్మ కథానాయికగా ఎంపికైంది. గతంలో వచ్చిన సూపర్‌హిట్ కామెడీ మూవీ 'భాగమ్ భాగ్'కు ఈ సినిమా సీక్వెల్ కావటం విశేషం. తొలి భాగం తరహాలోనే పక్కా కామెడీ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా రూపొందనున్నదని, మీనాక్షి కెరీర్‌లో ఓ మైలురాయిగా ఈ సినిమా నిలువనున్నదని బాలీవుడ్ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. ఈ నెలలోనే షూటింగ్ ప్రారంభించి, ఈ ఏడాది చివరిలో సినిమాను విడుదల చేయాలని మేకర్స్ భావిస్తున్నారు. మనోజ్ బాజ్‌పాయ్, అయేషాఖాన్ ఇందులో కీలక పాత్రధారులు.

## 'కల్కి 2'కు సర్వం సిద్ధం?



'కల్కి 2898ఏడీ' చిత్రం పానిండియా స్థాయిలో సృష్టించిన సంచలనం ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదు. ప్రపంచవ్యాప్తంగా దాదాపు పన్నెండొందల కోట్లు వసూలు చేసి ప్రభాస్ స్టామినా ఏంటో మరోసారి రుజువు చేసిందీ సినిమా. ఇప్పటివరకూ వచ్చిన ఫ్రాంచైజీల్లో తొలి పార్ట్‌కు ఇంత వసూళ్లు రావడం 'కల్కి 2898ఏడీ' విషయంలోనే జరిగింది. ప్రస్తుతం ఈ సినిమా సెకండ్ పార్ట్ కోసం ఆడియన్స్ ఆతృతగా ఎదురుచూస్తున్నారు. ఈ సెకండ్ పార్ట్‌కు సంబంధించిన కొంత ఫుటేజ్ ఇప్పటికే సిద్ధంగా ఉందని, మిగతా షూటింగ్‌కు ఎక్కువ సమయం పట్టదని గతంలో మేకర్స్ ప్రకటించారు. మరి ప్రభాసేమో ఫౌజీ, స్పిరిట్ షూటింగుల్లో బిజీగా ఉన్నారు. అందుకేనేమో.. అమితాబ్‌తో షూటింగ్ మొదలుపెట్టబోతున్నారు 'కల్కి 2' యూనిట్. ఇది నిజంగా డార్లింగ్ అభిమానులకు శుభవార్తే. ప్రస్తుతం 'కల్కి 2' పనిమీద బిగ్‌బీ హైదరాబాద్‌లోనే ఉన్నారు. త్వరలోనే ఆయన మళ్లీ అశ్వత్థామగా మారబోతున్నారు. ఇంకొన్ని రోజుల్లోనే షూటింగ్ మొదలుకానుంది. ఈ షెడ్యూల్‌లో ప్రభాస్ లేని సీక్వెన్స్‌ని షూట్ చేస్తారు. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలోనే రానున్నది.



## ఓ హింసాత్మక ప్రపంచం



ఈ ఏడాది ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమాల్లో 'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్' ఒకటి. 'కేజీఎఫ్'ఫేం యష్ కథానాయకుడిగా నటిస్తూ వెంకట్ కె.నారాయణతో కలిసి నిర్మిస్తున్న ఈ చిత్రానికి గీతూ మోహన్‌దాస్ దర్శకురాలు. కియారా అద్వానీ, నయనతార, రుక్మిణీవసంత్ కథానాయికలు. హ్యూమా ఖురేషి, తారా సుతారియా కీలక పాత్రధారులు. ఇటీవల విడుదలైన గ్లింప్స్ దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. అలాగే సినిమాపై అంచనాలను కూడా పెంచింది. తాజాగా శుక్రవారం ఈ సినిమా టీజర్‌ని విడుదల చేశారు. ఓ కొత్త హింసాత్మక ప్రపంచాన్ని ఈ టీజర్ ఆవిష్కరించింది. సర్కస్ వాతావరణం, తూర్పు ఆసియా శైలిని గుర్తు చేసే ప్రపంచం ఇలా వివిధ కాలాల్లో కథ ప్రయాణిస్తున్నట్టు టీజర్ చెబుతున్నది. ఇందులో యాక్షన్ సన్నివేశాల్లో హింస ఎక్కువగా కనిపిస్తున్నా.. అంతర్గతంగా ఏదో లోతైన భావాన్ని ఆ హింస ఆవిష్కరిస్తున్నది. టేకింగ్ విషయంలో ప్రత్యేక శ్రద్ధ, నటీనటుల శక్తివంతమైన నటన ఈ టీజర్‌కు హైలైట్స్. ఇందులో హీరో యష్ ఓ విపత్తులా కనిపిస్తున్నాడు. రూపం, లోతైన హావభావాలు పాత్రలోని తీవ్రతను, ఉద్వేగాన్ని తెలియజేస్తున్నాయి. మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా వివిధ భాషల్లో ఈ సినిమా విడుదల కానున్నది.

## ఇండో అమెరికన్ మూవీలో..

వైవిధ్యమైన పాత్రలను ఎంచుకుంటూ నటిగా దూసుకుపోతున్నది బెంగళూరు భామ ప్రియమణి. 'ఫ్యామిలీమ్యాన్' సిరీస్ బాలీవుడ్‌లోనూ ప్రియమణికి మంచిపేరు తెచ్చిపెట్టింది. ఆమె కీలక పాత్ర పోషించిన విజయ్ 'జననాయగన్' చిత్రం త్వరలో విడుదల కానున్నది. ఇదిలావుంటే.. అత్యంత భారీ స్థాయిలో నిర్మించనున్న ఓ ఇండో అమెరికన్ ప్రాజెక్ట్ కోసం ఓ ప్రముఖ హాలీవుడ్ నిర్మాణ సంస్థ ఇటీవలే ప్రియమణిని సంప్రదించారు. అందులోని కీలక పాత్రకోసం ప్రియమణిని ఎంపిక చేసుకున్నారు. హర్ష్ మహాదేశ్వర్ దర్శకత్వం వహించనున్న ఈ చిత్రం.. ఇండో అమెరికన్ సంస్కృతుల నేపథ్యంలో ఒక వలస కుటుంబం కొనసాగించే సున్నితమైన భావోద్వేగ ప్రయాణమని తెలుస్తున్నది. ప్రముఖ బాలీవుడ్ నటుడు మోహిత్ రైనా ఇందులో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించిన ఇతర వివరాలు తెలియాల్సివుంది.